క్లుప్తంగా

అలంకారంలో వాసవీమాత



ముత్యాల కవచం అలంకారంలో వాసవీమాత

వేంపల్లె : స్థానిక మెయిన్ బజార్‌లోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శుక్రవారం ముత్యపు కవచం అలంకారంలో వాసవీమాత దర్శనమిచ్చారని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్, ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు బచ్చు భాగేశ్వరమ్మలు తెలిపారు. అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ సిద్ధాంతి నేతృత్వంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. రాత్రి ఆలయంలో అమ్మవారికి ప్రాకారోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య యువ సంఘం అధ్యక్షుడు రాయవరం సుబ్బు, ఆలయ నిర్వాహకులు మిట్టా మోహన్ రావు, అవోపా మహిళా విభాగ్ ఉపాధ్యక్షురాలు బైరిశెట్టి నాగ లక్ష్మి, మహిళా మండలి కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రేపు యోగాసన ఛాంపియన్ షిప్

వేంపల్లె : ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపుల పాయ ట్రిపుల్‌ఐటీలో ఈనెల 3వ తేదిన జిల్లాస్థాయి యోగాసన ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వైఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు రాధిక తెలిపారు. ట్రిపుల్‌ఐటీలో జిల్లా స్థాయిలో జరిగే యోగాసన ఛాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ చూపే యువతకు రాష్ట్రస్థాయి యోగాసన ఛాంపియన్ షిప్ పోటీలలో అడుగుపెట్టే అవకాశం ఉంటుందన్నారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టే యోగాసన పోటీల్లో యువతలో శారీరక దారుఢ్యం, మానసిక శాంతి, శ్రమశీలతను పెంపొందించడమే కాకుండా, యోగాసనాల్లో వారి ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేసే వేదికగా నిలుస్తాయన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన యువతకు అథ్లెట్లు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేయడం జరుగుతుంన్నారు. పాల్గొనే యువత పేర్లను నమోదు చేసకోవాలన్నారు. పేరు నమోదు కోసం 99592 59211, 99636 28927 అనే ఫోన్ నంబర్లకు సంప్రదించాలని కోరారు.

పందులు కనిపిస్తే బయటికి తరలిస్తాం

జమ్మలమడుగు : ఎర్రగుంట్ల మున్సిపాలిటీలో పందులు కనిపిస్తే వాటిని బయటి ప్రాంతాలకు తరలిస్తామని మున్సిపల్ కమిషనర్ శేష ఫణి తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పందుల యజమానులకు ఇచ్చిన గడువు పూర్తైందన్నారు. పందులు ఎక్కడ కనిపించిన మున్సిపల్ సిబ్బంది వాటిని పట్టుకుని బయటి ప్రాంతాలకు తరలిస్తారన్నారు. ప్రస్తుతం శాంతినగర్, మార్కెట్ యార్డు పక్కన, వేంపల్లి రోడ్డు, శ్రీరాములపేట, క్రాంతినగర్, పోలీసు క్వార్టర్స్, ముద్దనూరు రోడ్డు, టీడీపీ కల్యాణ మండపం సమీపంలో సంచరిస్తున్న పందులను తమ సిబ్బంది పట్టుకుంటారన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ట వేడుకలు

పులివెందుల టౌన్ : వెంకటాపురం బీసీ కాలనీలో నూతనంగా శ్రీసీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం నుంచి విగ్రహ ప్రతిష్ట వేడుకలు జరగనున్నాయని మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ చంద్రమౌళి తెలిపారు. 2వ తేదీ ఉదయం గణపతిపూజ, యాగశాల ప్రవేశం, కలశస్థాపన మహా మంగళ హారతులు, 3వ తేదీన ప్రాతఃకాల పూజ, దీక్షా హోమాలు, మహాస్నపనం, ధ్వజ ప్రతిష్ట నిర్వహించనున్నారు. 4వ తేదీన దీక్షా హోమాలతోపాటు యంత్ర, బింబ ప్రతిష్ట, మహా కుంభాభిషేకం, మూల విగ్రహ ప్రతిష్ట నిర్వహించి శ్రీసీతారామ కల్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందన్నారు. భక్తులు ఈ విగ్రహ ప్రతిష్ట పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

మండల విద్యాశాఖాధికారిగా అన్నయ్య



ముద్దనూరు : మండల విద్యాశాఖాధికారి–1గా సి.అన్నయ్య విధుల్లో చేరారు. జమ్మలమడుగులోని పీఆర్ ఉన్నత పాఠశాలలో తెలుగు స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అన్నయ్య పూర్తి అదనపు బాధ్యతలతో మండల విద్యాశాఖాధికారిగా నియమితులయ్యారు. ప్రభుత్వ పాఠశాలలు సక్రమంగా నడిపించి అభివృద్ధి చెందడానికి కృషిచేస్తానని ఎంఈవో తెలిపారు.

ప్రీమియం గడువు పొడిగింపు

వీరపునాయునిపల్లె : దిగుబడి ఆధారిత పంటలకు ప్రీమియం చెల్లించేందుకు ఈనెల 14వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు తెలిపారు. ఈ అవకాశాన్ని పంటలు సాగు చేసిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

దీనబంధు ఆశ్రమానికి వితరణ

పులివెందుల టౌన్ : పులివెందులలో నివాసముంటున్న మోహిత్‌రెడ్డి తన తండ్రి, లయోలా డిగ్రీ కళాశాల లెక్చరర్ విశ్వనాథరెడ్డి జయంతిని పురస్కరించుకుని లింగాల మండలంలోని దీనబంధు ఆశ్రమానికి రూ.5వేల నగదును ఆశ్రమ నిర్వాహకుడు జనార్ధన్‌రెడ్డికి వితరణగా అందించారు.

చురుగ్గా.. పత్తి తీసే పనులు

- కూలీలు దొరకక రైతుల ఇబ్బందులు
- రోజుకు ఒక్కొక్కరికి రూ.470ల కూలీ
- మార్కెట్‌లో తగ్గిన పత్తి ధరలు



ఎండలకు కాయలు పగలడంతో కనిపిస్తున్న పత్తి

వేముల : గ్రామాల్లో పత్తి తీసే పనులు చురుగ్గా సాగుతున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా వేసవి పంటగా పత్తి పంటను సాగు చేసుకున్నారు. నియోజకవర్గంలోని వేముల, వేంపల్లె మండలాల్లో అత్యధికంగానూ, మిగతా మండలాల్లో అక్కడక్కడ రైతులు సాగు చేసుకున్నారు. వేముల, వేంపల్లె మండలాల్లో సుమారు ఐదారు వేల ఎకరాలలో పత్తి సాగు చేసుకున్నారు. ప్రస్తుతం తోటలలో పత్తి పంటలో దిగుబడులు చేతికొస్తున్నాయి. వర్షాలు లేక తోటలలో పత్తి కాయలు పగిలిపోయాయి. దీంతో తోటలలో కాయలు పత్తి తెల్లగా కనిపిస్తోంది.

పత్తిలో ఆశాజనకంగా దిగుబడులు

ఈ ఏడాది మార్చి నెలలో పత్తి సాగు చేసినప్పటి నుంచి అడపా దడపా వర్షాలు కురిశాయి. దీంతో పంట ఏపుగా పెరిగింది. పత్తి పంటకు ఎండలు ఏమాత్రం ప్రభావం చూపలేకపోయాయి. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో అరకొర వర్షాలకు పత్తి పంటలో కాపు బాగా వచ్చింది. ఎకరాకు 12 క్వింటాళ్ల నుంచి 14 క్వింటాళ్ల మేర సాగులో దిగుబడులు వస్తున్నాయని రైతులు అంటున్నారు.

రైతులను వేధిస్తున్న కూలీల కొరత

తోటలలో పత్తి తీసేందుకు కూలీలు దొరకక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఎండలు బాగా ఉండటంతో తోటలలో పత్తి కాయలు పగిలిపోయాయి. దీంతో తోటలలో పత్తి తెల్లగా కనిపిస్తోంది. వర్షాలు వస్తే పత్తి ఎక్కడ దెబ్బతింటోందనని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో పత్తి తీసేందుకు కూలీల కోసం రైతులు వెంపర్లాడుతున్నారు. పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా వేసవి పత్తి పంట, ఉల్లి, మిరప పంటలు విస్తారంగా సాగులో ఉన్నాయి. దీంతో ఎక్కడికక్కడ కూలీలకు డిమాండ్ పెరుగుతోంది. కూలీల కొరత ఉండటంతో రైతులు బయట పారతాల నుంచి కూలీలను రప్పించుకుని పనులు చేయించుకుంటున్నారు. గ్రామాల్లో పత్తి తీయడంతోపాటు ఉల్లిలో కలుపు తీసే పనులు, మిరప కాయలు కోతలు తదితర పనులకు ఆటోలలో వస్తున్నారు. దీంతో తోటలలో ఉన్న పత్తి కూలీలు రావడంతో ఇంటికి చేరుతోందని రైతులు అంటున్నారు. బయట ప్రాంతాల నుంచి వచ్చే కూలీలకు రోజుకు రూ.470లు కూలీ ఇస్తున్నారు. సాయంత్రం 5 గంటలకు వెళ్లిపోతున్నారు. కూలీలకు ఆటో బాడుగ కూడా రైతులే ఇస్తున్నారు. తోటలలో ఒక్కొక్క కూలీ 30 నుంచి 40 కిలోల పత్తి తీస్తున్నారు తోటలలో నాలుగు దశలలో పత్తి తీయాల్సి ఉంటుంది. సాగులో దిగుబడులు ఉన్నప్పటికి ఎరువుల ధరలు, కూలీల రేట్లు పెరగడంతో పెట్టుబడులు పెరిగి ఆదాయం తగ్గుతోందని రైతులు అంటున్నారు.



తోటలలో పత్తిని తీస్తున్న కూలీలు

మార్కెట్‌లో తగ్గిన పత్తి ధరలు

తోటలలో దిగుబడులు వచ్చేసరికి మార్కెట్‌లో పత్తి ధరలు తగ్గిపోయాయి. ఈ ఏడాది పత్తి ధరలు బాగా ఉంటాయని ఆశించిన రైతులకు నిరాశే మిగులుతోంది. పంటలు సాగు చేసే సమయంలో ఉన్న ధరలు దిగుబడులు వచ్చే సరికి ధరలు ఉండటంలేదు. ఈ ఏడాది మొదట్లో క్వింటా పత్తి రూ.7,800లు ఉండగా, ప్రస్తుతం క్వింటా పత్తి రూ.7,500లతో తూకాలు వేస్తున్నారు. ఈ దఫా పత్తి ధరలు ఉంటాయని క్వింటా పత్తి రూ.8వేల వరకు ఉంటుందని రైతులంతా అనుకున్నారు. కానీ మార్కెట్‌లో పత్తి ధరలు తగ్గుతూ వస్తున్నాయి. సాగులో పెట్టుబడులు పెరగడంతో ప్రస్తుతం ఉన్న ధరలతో ఆదాయం ఉండదని రైతులు అంటున్నారు.

కూలీలు దొరకడంలేదు



పత్తి తీసే పనులు చురుగ్గా సాగుతున్నాయి. పత్తి తీసేందుకు కూలీలు దొరకడం లేదు. వర్షాలు వస్తే తోటలలో ఉన్న పత్తి దెబ్బతింటుందనే బయటి ప్రాంతాల నుంచి కూలీలను రప్పించుకుని పత్తి తీస్తున్నాం. ఎక్కడికక్కడ పనులు ఉండటంతో కూలీలకు డిమాండ్ పెరిగింది.

– సుదర్శన్‌రెడ్డి, పత్తి రైతు, గొందిపల్లె

ధరలు తగ్గడంతో నష్టపోతున్నాం



పత్తి సాగులో నష్టాలు వస్తున్నాయి. సాగులో పెట్టుబడులు పెరిగాయి. మార్కెట్‌లో పత్తి ధరలు తగ్గడంతో నష్టపోతున్నాం. క్వింటా పత్తి రూ.7,500లకు కొనుగోలు చేస్తున్నారు. మొదట్లో ఉన్న ధరలు దిగుబడులు వచ్చేసరికి ఉండటంలేదు. .

– ప్రకాష్‌రెడ్డి, పత్తి రైతు, గొందిపల్లె

ప్రారంభమైన పాలిటెక్నికల్ స్పాట్ అడ్మిషన్లు

సింహాద్రిపురం : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ శివశంకర్ తెలిపారు. పాలీ సెట్ ద్వారా భర్తీ కానీ సీట్లను ప్రత్యక్ష ప్రవేశాల ద్వారా భర్తీ చేస్తున్నామన్నారు. పదవ తరగతి పాసై పాలీసెట్ ర్యాంక్ ఉన్నా, లేకపోయినా సీట్లకు అర్హులన్నారు. ఆసక్తిగల విద్యార్థులు తక్షణమే కళాశాలలోని కార్యాలయంలో సంబంధిత పత్రాలతో సంప్రదించాలన్నారు. మొదటి వచ్చిన వారికి ప్రాధాన్యత ప్రాతిపదికన అడ్మిషన్ పక్రియ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9010222184 అనే ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఈ అవకాశాన్ని నరాల, వెన్నముక, మెదడు సంబంధిత సమస్యలతో బాధపడుతున్నవారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ఆసుపత్రిలో నూతనంగా డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించడం జరిగిందని, కిడ్నీ సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

నూతన విధానాన్ని అమలు చేయాలి



మాట్లాడుతున్న ఏపీడీ సుబ్బారెడ్డి

కమలాపురం : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అప్లికేషన్ విధానాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని ఆ పథకం ఏపీడీ సుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో దు కమలాపురం, వల్లూరు, ఎర్రగుంట్ల మండలాల టీఏ, ఎఫ్ఏలకు నూతన అప్లికేషన్ అమలు చేసే విధానంపై ఆయన శిక్షణ నిచ్చారు. ఉపాధి హామీ పథకంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం నూతన అప్లికేషన్ విధానం ప్రవేశ పెట్టిందన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది ఈ విధానాన్ని క్షేత్రస్థాయిలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ఉపాధి హామీ కూలీల హాజరు ఎన్ఎంఎంఎస్, ఫేస్, ఆధార్ అథెంటికేషన్ తప్పని సరిగా తీసుకోవాలన్నారు. అలాగే ఉపాధి పనుల జియో ట్యాగింగ్ విధానంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పవర్ పాయింట్ ప్రొజెక్టర్ ద్వారా సిబ్బందికి శిక్షణ నిచ్చారు. అనంతరం రీసోర్స్ పర్సన్లు అన్నా నాయక్, ఉపేంద్రరెడ్డిలు, కోర్స్ డైరెక్టర్ వెంకట సుబ్బయ్యలు పలు అంశాలపై శిక్షణ నిచ్చారు. కార్యక్రమంలో టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం

లింగాల : రక్తదానం చేయడం మరొకరికి ప్రాణ దానం చేసినట్లేనని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. ఇప్పట్ల గ్రామ సమీపంలోని లీలావతి చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో శుక్రవారం 16వ వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. ఈ వేడుకకు ఎమ్మెల్సీ హాజరై రక్తదానం చేసిన రక్తదాతలను అభినందించారు. 65 మంది దాతలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు మూలి కిరణ్‌కుమార్ రెడ్డి, రక్తనిధిమెడికలాఫీసర్ డాక్టర్ భార్గవ్, లింగాల పీహెచ్‌సీ డాక్టర్ ప్రసన్నకుమార్, దీనబంధు ఆశ్రమ నిర్వాహకుడు జనార్ధన్‌రెడ్డి, స్నేహిత అమృతహస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూముల పరిశీలన



జెఎన్‌టీయూ స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న సీఐ, ఎంపీడీఓ, తహసీల్దార్‌లు

పులివెందుల రూరల్ : ఈనెల 12న పులివెందుల జెడ్పీటీసీ స్థానానికి సంబంధించి ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే పోలింగ్ బాక్సులు పులివెందులకు చేరాయి. పట్టణంలోని స్థానిక ముద్దనూరు రోడ్డులో ఉన్న జేఎన్‌టీయూ కళాశాలలో పోలింగ్ బాక్సలను భద్రపరిచారు. ఈ సందర్భంగా సీఐ చాంద్‌బాషా, ఎంపీడీఓ కృష్ణమూర్తి, తహసీల్దార్ నజీర్ అహ్మద్‌లు కళాశాల ప్రిన్సిపాల్‌తో కలిసి జెఎన్‌టీయూలోని స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. బయట కూడా సీసీ కెమెరాల తోపాటు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని వారు సూచించారు.

సచివాలయంలోనే పింఛన్ల పంపిణీ



పింఛనుకోసం సచివాలయంలో వేచివున్న లబ్ధిదారులు

ముద్దనూరు : సామాజిక భద్రతా పింఛన్లను లబ్ధిదారుల ఇంటివద్దకే వెళ్ళి అక్కడే వారికి పింఛన్లను పంపిణీ చేయాలని ప్రభుత్వ నిబంధన. అయితే శుక్రవారం ముద్దనూరు మేజర్ పంచాయతీ పరిధిలోని రెండు సచివాలయాల సిబ్బంది స్థానిక సచివాలయంలోనే ఉదయం నుంచి పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఉదయం 11 గంటలుదాటినా పింఛన్లు పంపిణీకి సచివాలయ సిబ్బంది తమ ఇంటివద్దకు వచ్చి పింఛను అందజేయకపోవడంతో అవ్వాతాతలు ఆందోళనకు గురయ్యారు. వెంటనే తమ సచివాలయం వద్దకుచేరుకున్నారు. సచివాలయ సిబ్బంది అక్కడే వారి వద్ద నుంచి వేలిముద్రలు తీసుకుని పింఛను సొమ్ము పంపిణీ చేశారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే రెండు సచివాలయాలున్నాయి. ఉన్నతాధికారులు సమక్షంలోనే సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేయడం గమనార్హం. పలువురు వికలాంగులు,వృద్ధులు తమ సహాయకులతో రావడానికి ఇక్కట్లు ఎదుర్కొన్నారు.

విద్యార్థులు యోగాతో ఒత్తిడిని తగ్గించుకోవాలి



సీపీఆర్ చేయు విధానంపై డెమో చేసి చూపిస్తున్న వైద్యులు

వేంపల్లె : ఒత్తిడి అనేది గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుంది, కాబట్టి విద్యార్థులు ఒత్తిడిని తగ్గించుకోవడంతోపాటు యోగా, ధ్యానం, ఇతర ఒత్తిడి తగ్గించే పద్ధతులను అనుసరించడం మంచిదని గుండె జబ్బుల నిపుణుడు డాక్టర్ శ్రావణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఇడుపులపాయలోని ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో కడపకు చెందిన వేదాంత ఆసుపత్రి ఆధ్వర్యంలో విద్యార్థులకు గుండె జబ్బులపై అవగాహన సదస్సు నిర్వహించారు. అలాగే గుండె పోటు వచ్చిన వ్యక్తికి సీపీఆర్, లైఫ్ సపోర్ట్ విధానంపై డెమో ద్వారా విద్యార్థులతో చేయించి చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండె జబ్బులను ముందుగానే గుర్తించడానికి రెగ్యులర్ హెల్త్ చెకప్‌లు చేయించుకోవడం చాలా ముఖ్యమన్నారు. ప్రస్తుతం చిన్న వయస్సు వారికి కూడా గుండె జబ్బులు సోకి మృత్యువాత పడుతున్నారన్నారు. ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలపాటు వ్యాయామం చేయడం గుండె ఆరోగ్యానికి మంచిదన్నారు. ఆకస్మాతుగా వ్యక్తి పడిపోతే చదునైనా నేలపై పడుకోబెట్టి పల్స్ చెక్ చేసి వెంటనే సీపీఆర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్, డీన్ రమేష్ కైలాష్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ దీప్తి, పీఆర్ఓ తిరుపతి రెడ్డి, ఆర్కేవ్యాలీ వైద్యులు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో దరిద్రపు పాలన కొనసాగుతోంది

– ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు : రాష్ట్రంలో దరిద్రపు పాలన కొనసాగుతుందని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి ఘాటుగా విమర్శించారు. శుక్రవారం పీ4 ప్రజావేదికలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ప్రభుత్వ విప్ ఆదినారాయణరెడ్డి మాట్లాడిన మాటలకు ఆయన కౌంటర్ ఇచ్చారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో డబుల్ ఇంజన్ పాలనలో చేసింది ఏమిలేదన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వంలో రైతులు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. రాయలసీమ ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టులు టీడీపీ పూర్తి చేసిందని చెప్పుకోటానికి కొంచెమైన సిగ్గు ఉండాలన్నారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధన్యత ఇచ్చివాటిని పూర్తిస్థాయి వరకు తీసుకుని వచ్చింది అప్పటి ముఖ్యమంత్రి మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గండికోట జలాశయంలో 26 టీఎంసీల నీరు నిల్వ చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. ఏదో అరకొరపనులు చేసి ప్రాజెక్టులు పూర్తి చేశామని చెప్పుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో అధికారంలోనికి రావడం కోసం అచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోనికి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను అట్టబండ ఎక్కించిన ఏకైక ప్రభుత్వం దేశంలో ఉందంటే ఆది రాష్ట్రంలోని ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వమే అన్నారు. ఆదినారాయణరెడ్డి తన స్థాయిని మరచిపోయి మాట్లాడుతున్నారు. సూపర్ సిక్స్ అమలు చేయండి సూపర్ చెక్ పెడుతామంటూ ఏదో ప్రగల్భాలు పలుకుతున్నారు. నీ రాజకీయ జీవితం వైఎస్ కుటుంబం పెట్టిన బిక్షనే అన్న సంగతి జిల్లా వాసులకందరికి తెలుసున్నారు. 2014లో టిక్కెట్ రాకపోతే ఎవరి కాళ్లపట్టుకుని తెచ్చుకున్నావో ప్రజలకందరికి తెలుసు. రాష్ట్రంలో 14 నెలల కాలంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం లక్షా 80 వేల కోట్ల రూపాయలు అప్పు చేసింది. ఆ డబ్బులు ఎక్కడ ఖర్చుపెట్టారో ఎవరికి తెలియదు. 2014–19 కాలంలో టీడీపీ ప్రభుత్వం 7 లక్షల కోట్ల అప్పులు చేసింది. ఆ తర్వాత వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 3.5 లక్షల కోట్లు మాత్రమే అప్పులు చేసి సంక్షేమ పథకాలకు ఖర్చుపెట్టింది. ఇంత వరకు అడబిడ్డ నిధికింద 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి నెలకు 1500 రూపాయలు, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కింద మూడువేల రూపాయల గురించి ప్రభుత్వం అసలు ఒక్కమాట కూడా మాట్లాడకుండా ప్రజలకు మోసం చేస్తుందన్నారు. వెఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కొమెర్ల మోహన్‌రెడ్డి, బీసీ నాయకుడు సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం మహా పుణ్యకార్యం



అన్నదానం చేస్తున్న రామ సేవకులు

కమలాపురం : అన్నదానం మహా పుణ్యకార్యం అని కమలాపురం పట్టణానికి చెందిన రామ సేవకులు తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రామ సేవకుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక నుంచి ప్రతి శుక్రవారం రోజున మధ్యాహ్నం 12 గంటలకు ఆసుపత్రి వద్ద అన్నదానం ఏర్పాటు చేస్తామన్నారు. రోగులు, పేద ప్రజలు అన్నదానం స్వీకరించాలని వారు తెలిపారు. కాగా ఈ రోజు పట్టణానికి చెందిన రామ సేవకుడు చాటకొండు నరసింహారావు దాతగా నిలిచారు. ప్రతి వారం ఒకరు దాతగా వ్యవహరిస్తున్నట్లు వారు తెలిపారు.

అంజన్న సన్నిధికి మహిళల పాదయాత్ర



గండికి పాదయాత్రగా వెళుతున్న మహిళలు

లింగాల : శ్రావణ మాసోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం లింగాలకు చెందిన సుమారు 20 మంది మహిళలు పాదయాత్ర చేపట్టారు. శ్రావణ మాస రెండవ శనివారం ఉదయం నాటికే గండి అంజన్న సన్నిధికి చేరుకుంటామని మహిళలు అన్నారు. సుమారు 80 కి.మీ దూరం ఉన్న గండి క్షేత్రానికి పాదయాత్రగా వెళ్లి ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.

రేపు కృత్రిమ అవయవాల కోసం శిబిరం

వల్లూరు (చెన్నూరు) : దివ్యాంగులు, వయోవృద్ధులకు కృత్రిమ పరికరాల పంపిణీ కోసం వారిని పరీక్షించేందుకు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. మండలంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 3న మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు శిబిరం ఏర్పాటు చేశారన్నారు. అర్హతగల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పంట నమోదు కార్యక్రమం పరిశీలన



లింగాల : పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి



వేముల : ఇ క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏఓ ఓబులేసు

లింగాల : మండలంలోని ఇప్పట్ల గ్రామంలో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం వ్యవసాయ శాఖ ఏడీ ప్రభాకర్‌రెడ్డి మండల ఏఓ రమేష్‌తో కలిసి పరిశీలించి మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన ప్రతి పంట కూడా సర్వే నెంబర్ వారీగా పంట నమోదు చేయాలన్నారు. అలాగే రోజువారీ ప్రణాళిక ప్రకారం పంట నమోదు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. పంట నమోదు పక్రియను జిల్లా, రాష్ట్ర అధికారులు తనిఖీ చేస్తారని, ఏవిధమైన వ్యత్యాసాలు గమనించినా సిబ్బందిపై తగిన చర్యలు తీసుకుంటారన్నారు. రైతులందరూ తప్పనిసరిగా మీ గ్రామ రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి పంట నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా సిబ్బంది ప్రసన్న, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ప్రతి పంటను ఇ క్రాప్ చేయించుకోండి

వేముల : సాగులో ఉన్న ప్రతి పంటను ఇ క్రాప్ నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి ఓబులేసు రైతులకు సూచించారు. మండలంలోని రంగోరిపల్లెలో ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లు చేస్తున్న ఇ–క్రాప్ నమోదును శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. పంట నమోదు చేసుకోవడంవల్ల పంట నష్టపోతే ఇన్‌పుట్ సబ్సిడీ వర్తిస్తుందన్నారు. అలాగే ప్రభుత్వం ద్వారా అందే ఇన్సూరెన్స్‌తోపాటు నష్టపోయిన పంటలకు బీమా అందుతుందన్నారు. పంట నష్టపోతే ఇన్సూరెన్స్ పొందాలంటే ఇది తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో ఏఈఓ సురేష్, రైతులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి

పులివెందుల రూరల్ : తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఎర్రగుడిపల్లెలోని అంగన్‌వాడీ కేంద్రం-2లో తల్లిపాల వారోత్సవాలలో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఇవ్వడంవల్ల బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో కూడా తల్లులకు, గర్భిణులకు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. అలాగే అంగన్వాడీ కేంద్రాల్లో నాణ్యమైన విద్యనందించేందుకు అన్ని సదుపాయాలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం నాగమణి, మహిళా పోలీసు హరిత, తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : అలిరెడ్డిపల్లె, చింతలమడుగుపల్లెల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ముర్రుపాల ప్రాముఖ్యతపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపే తల్లి పాలను బిడ్డకు తాగించడంవలన వ్యాధి నిరోధక శక్తి పెంపొందించుకోవచ్చునన్నారు. బిడ్డకు 6 నెలలు పూర్తయ్యేంతవరకు తల్లి పాలనే తాగించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఫక్రుద్దీన్, సచివాలయ పంచాయతీ కార్యదర్శి కిశోర్ నాయుడు, వీఆర్ఓ షేక్ బాదుల్లా, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండల కేంద్రంలోని 1వ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐసిడియస్ సూపర్‌వైజర్ జయలక్ష్మి పాల్గొని తల్లి పాల ప్రాముఖ్యత గురించి తల్లులకు వివరించారు. ప్రతి ఏడాది ఆగస్టు 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, తల్లులు పాల్గొన్నారు.

కమలాపురంలో..



కమలాపురంలో అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ శ్రీలత

కమలాపురం : తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివని, అవే బిడ్డకు శ్రీరామ రక్ష అని, మొదటి టీకా కూడా అని ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలత తెలిపారు. కమలాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని 6వ వార్డు 2వ, చదిపిరాళ్ల దళితవాడ అంగన్‌వాడీ కేంద్రాలలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలులలో ఆమె మాట్లాడారు. ఒక రొమ్ముకు పూర్తిగా పాలిచ్చిన తర్వాతే మరొక రొమ్ము ద్వారా ఇవ్వాలన్నారు. అలా చేస్తే తల్లికి బిడ్డకు ఇద్దరికి మంచిదన్నారు. కాన్పుకు ముందు తీసుకునే ఆహారమే కాన్పు తర్వాత కూడా తీసుకోవచ్చని, పండ్లు అధికంగా తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగేశ్వరీ, వర్కర్లు యశోద, వరలక్ష్మీ, ఆశా, ఏఎన్ఎం, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

సమస్యలపై సీఎంను కలిస్తే అరెస్టులా..

కొండాపురం : గండికోట జలాశయంలో ముంపునకు గురైన 22 గ్రామాల ముంపు సమస్యలపై సీఎం చంద్రబాబును కలిసేందుకు శుక్రవారం ఉదయం వెళ్తుండగా కొండాపురం పోలీసులు సీపీఐ మండల కార్యదర్శి మనోహర్‌బాబును హౌస్ అరెస్ట్ చేయడం దారుణమన్నారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ కొండాపురంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు మార్చారు కానీ కొండాపురం జెడ్పీ ఉన్నతపాఠశాల వెనుక జలాలకు దగ్గర ఉండటంతో విషపురుగులు సంచరిస్తున్నాయి. నూతన ఉన్నత పాఠశాల నిర్మించాలన్నారు. కొండాపురం సంప్లమెంటరీ నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.